క్లుప్తంగా

డ్రోన్ సర్వేతో రికార్డుల స్వచ్ఛీకరణ



కె.వెంకటాపురంలో డ్రోన్ సర్వే ప్రారంభోత్సవంలో గ్రామ పెద్దలు, రైతులు

కోటవురట్ల : వివాదాలు లేని భూ రికార్డులే లక్ష్యంగా డ్రోన్ సర్వే జరుగుతోందని సర్పంచు పైల శ్రీదేవి మంగా ఇందిర భవానీ అన్నారు. కె.వెంకటాపురంలో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు..భూ రక్ష పథకంలో భాగంగా గురువారం డ్రోన్ సర్వే ప్రారంభించారు. సమగ్ర భూ సర్వేతో రికార్డులన్నీ స్వచ్ఛీకరణ అవుతాయని సర్పంచ్ అన్నారు. సర్వేకు సంబంధించి రికార్డులతో రైతులు సిద్ధంగా ఉండాలని, సర్వే చేస్తున్న అధికారులకు సహకరించాలని కోరారు.

సంపద కేంద్రాలపై దృష్టి సారించాలి



ఒంపోలు సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో రవికుమార్

మునగపాక: సంపద తయారీ కేంద్రాల ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందని ఎంపీడీవో పి.రవికుమార్ అన్నారు. మండలంలోని ఒంపోలు సంపదతయారీ కేంద్రాన్ని ఆయన గురువారం సందర్శించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సంపద తయారీ కేంద్రాల పట్ల పాలకులు, అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించాలన్నారు. సంపద తయారీ కేంద్రాలు అందుబాటులోకి వచ్చేలా చూడాలన్నారు. ఆయన వెంట ఈవోఆర్డీ ఈశ్వరరావు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో లక్ష బిల్వార్చన



నాగులాపల్లి శివాలయంలో లక్ష బిల్వార్చన కార్యక్రమంలో భక్తులు

మునగపాక : నాగులాపల్లి దేవాంగుల వీధిలోని పార్వతి సాంబమూర్తి దేవస్థానంలో గురువారం లక్ష బిల్వార్చన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ బిల్వార్చన కార్యక్రమం నిర్వహించారు. మహిళలు కార్యక్రమంలో పెద్దసంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి

పాయకరావుపేట : నియోజవర్గంలో ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కృషి చేయడం జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే చెంగల వెంకట్రావు అన్నారు. ఆయన సత్యవరం గ్రామంలో పర్యటించారు. తాండవ నదిలో చెత్త వేస్తున్నారని, నివారించే విధంగా కృషి చేయాలని గ్రామ సర్పంచ్ సకిలేటి రాము చెంగల వెంకట్రావును కోరారు. చెంగల స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

ఘనంగా అడవిరాజులబాబు విగ్రహ ప్రతిష్ట



విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో సర్పంచ్ శివకుమార్ దంపతులు

కోటవురట్ల : కె.తంగేడు గ్రామంలో నూతనంగా నిర్మించిన అడవిరాజులబాబు ఆలయంలో గురువారం విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వేద పండితులు శాస్త్రోక్తంగా హోమం చేసి విగ్రహ ప్రతిష్ట చేశారు. ఈ కార్యక్రమంలో సమీప గ్రామాల నుంచి భక్తులు పాల్గొన్నారు. సర్పంచ్ కొరుప్రోలు శివ కుమార్ దంపతులు, స్థానిక యువకులు ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ ఆచారం ప్రకారం శుక్రవారం అడవిరాజులబాబు పండగను జరిపేందుకు ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు.

శివపూజకు వేళాయే..

- శైవక్షేత్రాలకు శివరాత్రి శోభ
- ఆలయాల్లో రుద్రాభిషేకాలకు ఏర్పాట్లు



నామవరంలో స్వయంభూ రామలింగేశ్వర ఆలయం

నక్కపల్లి : శివరాత్రికి శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. మహేశ్వరుడు లింగాకారంలో ఉద్భవించిన రోజు కాబట్టి మహాశివరాత్రి అంటారు. ఈ పర్వదినాన బోళాశంకరుడ్ని దర్శించుకునేందుకు వచ్చే భక్తులతో శివాలయాలు కిటకిటలాడుతుంటాయి. వేకువ జాము నుంచే పరమశివుడ్ని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరతారు. శనివారం శివరాత్రి పర్వదినాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించేందుకు శైవక్షేత్రాల వద్ద ఘనంగా ఏర్పాట్లు చేశారు. పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాల్లో ప్రాచీనమైన శైవక్షేత్రాలున్నాయి. ఈ ఆలయాల్లో శివరాత్రి పర్వదినాన ప్రత్యేక పూజలు అభిషేకాలు, పార్వతీపరమేశ్వరుల కల్యాణం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి.

పాయకరావుపేట మండలం..

నామవరంలో స్వయంభూరామలింగేశ్వర ఆలయం ఉంది. నూర్లేళ్లక్రితం ఇక్కడ శివుడు స్వయం వ్యక్తమై వెలసినట్టు చెబుతారు. శివరాత్రినాడు ఇక్కడ తెల్లవారుజామున 3గంటల నుంచే ప్రత్యేక అభిషేకాలు జరుగుతాయి. ఉదయం 7గంటలకు స్వామివారి ఉత్సవమూర్తులను పల్లకిలో ఊరేగిస్తారు. సాయంత్రం 7గంటలకు పార్వతీకల్యాణం, రాత్రి లింగోద్భవ సమయంలో మహారుద్రాభిషేకం, రుద్రహోమం జరుగుతాయని ఆలయ అర్చకులు శాస్త్రి తెలిపారు. శివరాత్రి పర్వదినాన భారీ అన్నసంతర్పణ కార్యక్రమం జరుగుతుంది. సీతమ్మవారిమెట్టపై ధర్మలింగేశ్వర స్వామి ఆలయం కూడా ప్రాచీనమైనదే. తాండవనది ఒడ్డున ఉన్న కత్రాళ్లకొండపై పురాతన శివాలయం అయ్యప్పస్వామి ఆలయాలు ఉన్నాయి. ఇక్కడ కూడా శివరాత్రి పూజలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.



ఉపమాకలో లక్ష్మణేశ్వరస్వామి ఆలయం

నక్కపల్లి మండలం..

ఉపమాకలో లక్ష్మణేశ్వరస్వామి ఆలయం, ఒడ్డిమెట్టలో కాశీవిశ్వేశ్వర ఆలయాలు ఉన్నాయి. గొడిచర్లలో శేషలింగేశ్వరాలయం, ఉపమాకలో కూడా ప్రత్యేక రుద్రాభిషేకాలు, హోమాలు జరుగుతాయి. బ్రహ్మ తపస్సు చేసిన బంధుర సరస్సుకు అభిముఖంగా ఈ శివాలయం ఉండడంతో సరస్సులో స్నానమాచరించిన భక్తులు పరమశివుడ్ని దర్శించుకుంటారు. ఇక్కడ శివరాత్రిపర్వదినాన మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, రుద్రహోమం జరుగుతుంది. ఒడ్డిమెట్ట కైలాసగిరిపై ఉన్న కాశీవిశ్వేశ్వర ఆలయంలో శివరాత్రి పర్వదినాన మహారుద్రాభిషేకం, రాత్రి పార్వతీపరమేశ్వరుల కల్యాణం ఘనంగా జరుగుతుంది. చినదొడ్డిగల్లులోని రామలింగేశ్వర ఆలయంలో స్వామివారికి రుద్రాభిషేకం, కల్యాణం ఘనంగా నిర్వహిస్తారు.



నామవరంలో స్వయంభూ రామలింగేశ్వర స్వామి

ఎస్.రాయవరం మండలం..


ఎస్.రాయవరం గ్రామంలో శ్రీకృష్ణదేవరాయలు ప్రతిష్ఠించిన పురాతన శివాలయం ఉంది. బుర్రేశ్వర స్వామిగా భక్తులు కొలుస్తుంటారు. పెద ఉప్పలంలో బలిచక్రవర్తి ప్రతిష్ఠించిన బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయం ఉంది. ఈ రెండుచోట్ల శివరాత్రి పూజలకు ప్రత్యేక ఏర్పాట్లు జరుగుతున్నాయి. రుద్రాభిషేకాలు, హోమాలు నిర్వహిస్తారు. శివరాత్రి పర్వదినం సందర్భంగా రేవుపోలవరం సముద్రతీరానికి పలువురు భక్తులు వచ్చి పుణ్యస్నానమాచరిస్తారు.



దిమిలిలో చారిత్రక స్వయంభూ నగ్న లింగేశ్వరస్వామి



గోకివాడలో స్వయంభూ శివలింగం



ఎస్.రాయవరంలో శ్రీకృష్ణదేవరాయలు ప్రతిష్ఠించిన బుర్రేశ్వరస్వామి

హరికథ ప్రదర్శన నేడు

రాంబిల్లి : మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా దిమిలిలో శుక్రవారం శ్రీకృష్ణ రాయబారం అనే హరికథను ప్రదర్శించనున్నట్టు రిటైర్డు హెచ్ఎం కోవెల వెంకటరావు తెలిపారు. రిటైర్డు ఎస్ఎస్ఎస్‌టీఎల్ అడిషనల్ డైరెక్టర్ పప్పల బాలయోగి సహకారంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు.

రాంబిల్లి: శివరాత్రి పూజలకు శివాలయాలు సిద్ధమయ్యాయి. దిమిలిలో చారిత్రక స్వయంభూ నగ్న లింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, లక్ష పత్రి పూజలు నిర్వహించనున్నారు. భజనలు , కోలాటాలు, లలిత మాత నాట్య బృందం వారితో సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్టు నిర్వాహక కమిటీ ప్రతినిధులు డబ్బీరు రామలక్ష్మణలు తెలిపారు. గోకివాడలో స్వయంభూ శివలింగం సన్నిధిలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించనున్నారు. రాంబిల్లికి చెందిన పిన్నంరాజు వెంకటపతిరాజు(చంటిరాజు) ఆధ్వర్యంలో ఏటా ఇక్కడ ప్రత్యేక పూజలు, భారీ అన్నసమారాధన కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఈ ఏడాది పూజలు, అన్న సమారాధన కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్టు చంటిరాజు తెలిపారు. ఇక్కడ కూడా నిత్యం ప్రవహించే పుణ్యధార ఉంది.

ఉపాధి కూలీలకు సదుపాయాలు కల్పించాలి

కోటవురట్ల: వేసవిలో ఉపాధి కూలీలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని సర్పంచ్ పైల శివరామ్ సూచించారు. గ్రామ శివారులోని కిట్టయ్య చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను సర్పంచ్ గురువారం పరిశీలించారు. హాజరైన కూలీలు, మస్తర్లను పరిశీలించారు. వేసవి ఆరంభం నుంచే ఎండలు పెరిగాయని, కూలీలకు ఇబ్బంది లేకుండా అందుబాటులో ఫస్ట్ ఎయిడ్ కిట్, మంచినీళ్లు, నీడకు టార్పాలిన్లు ఉంచాలని ఉపాధి సిబ్బందికి సర్పంచ్ సూచించారు. వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రతి కుటుంబానికి వంద రోజుల పనిదినాలు కల్పించాలన్నారు.

ట్రాక్టర్ బోల్తా

నక్కపల్లి : జాతీయరహదారిపై వేంపాడు జంక్షన్‌లో గురువారం తెల్లవారు జామున ట్రాక్టర్ బోల్తా పడడంతో డ్రైవర్ ఎం.దుర్గకు గాయాలయ్యాయి. ఉద్దండపురం నుంచి వేంపాడు ఊళ్లోకి వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ బోల్తాపడింది. తొట్టెలో ఉన్న చెక్కలు రోడ్డుపై పడడంతో రోడ్డుపై రాకపోకలు నిలిచిపోయి ట్రాఫిక్ జామ్ అయింది. పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని రోడ్డుపై ట్రాక్టర్‌ను తొలగించి రాకపోకలు పునరుద్ధరించారు.

ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యదాయకం

కోటవురట్ల : ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం సాధ్యమని సర్పంచ్ చిటికెల కాశీలక్ష్మి అన్నారు. సుంకపూరు గ్రామంలో ఏపీసీఎన్ఎఫ్, అనకాపల్లి ఆధ్వర్యంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ మితిమీరిన రసాయనాల వాడకం అనర్థదాయకమన్నారు. మాస్టర్ ట్రైనర్ కె.వరలక్ష్మి మాట్లాడుతూ మినుము పంటలో రసం పీల్చే పురుగు నివారణకు కషాయం పిచికారీ చేయాలన్నారు.

ఆంగ్లమాధ్యమం అమలు జగనన్నకే సాధ్యం

- ఎమ్మెల్యే బాబూరావు
- విద్యార్థులకు కాపీ రైట్ పుస్తకాల పంపిణీ

నక్కపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం అమలు జగనన్నకే సాధ్యమైందని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. గురువారం డీఎల్‌పురం పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడు ఏడిద వెంకటరమణ తన సొంత ఖర్చులతో కొనుగోలు చేసిన కాపీ రైట్ పుస్తకాలను ఆయన విద్యార్థులకు పంపిణీ చేశారు. గతంలో సామాన్యులకు, పేద విద్యార్థులకు ఆంగ్లమాధ్యమం అందని ద్రాక్షగా ఉండేదన్నారు. జగనన్న అధికారం చేపట్టిన తర్వాత నాడు నేడు పథకం ద్వారా ప్రతి పాఠశాలలో సుమారు రూ.50లక్షల నుంచి కోటి రూపాయలు ఖర్చు పెట్టి మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు, డిజిటల్ క్లాసు రూములు ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కిల్లాడ కృష్ణ, ఎంపీటీసీ లొడగల చంద్రరావు పాల్గొన్నారు.



డీఎల్‌పురం పాఠశాలలో కాపీరైట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

27, 28 తేదీల్లో దేవాలయ భూముల వేలం

మునగపాక : మండలంలోని పలు దేవాలయాలకు సంబంధించిన భూములకు ఈ నెల 27, 28 తేదీల్లో వేలంపాట నిర్వహిస్తామని ఆలయ కార్య నిర్వహణాధికారి సత్యనారాయణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. రామగిరిలోని శ్రీ కోదండ సీతారాముల ఆలయానికి చెందిన 10.14 ఎకరాల భూమికి 27వ తేదీన ఉదయం 11 గంటలకు,అలాగే మునగపాక సీతారాముల ఆలయానికి చెందిన 27.55 ఎకరాల భూమికి 28వ తేదీన ఉదయం 11 గంటలకు, మునగపాకలోని భీమేశ్వరస్వామి ఆలయానికి చెందిన 3.52 ఎకరాల భూమికి 28వ తేదీన మధ్యాహ్నం 12.30 గంటలకు వేలం పాట జరుగుతుందన్నారు. అలాగే జేపీ అగ్రహారంలోని 3.32 ఎకరాల భూమికి అదేరోజు మధ్యాహ్నం 3.30 గంటలకు వేలం పాట జరుగుతుందన్నారు. ఆసక్తి గల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సత్యనారాయణమూర్తి కోరారు.

హెటెరో సహకారంతో పాఠశాలలో ఆర్‌వో ప్లాంట్

- రూ.3 లక్షల వ్యయంతో ఏర్పాటు
- 600 మంది విద్యార్థినులకు తాగునీటి సదుపాయం

నక్కపల్లి : పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు హెటెరో కంపెనీ యాజమాన్యం సంపూర్ణ సహకారం అందిస్తుందని కంపెనీ డీజీఎంలు సుబ్బారెడ్డి, కుల్లాయిరెడ్డి, ఫైనాన్స్ మేనేజర్ ఎంఎస్‌వీఎస్ రెడ్డి తెలిపారు. గురువారం నక్కపల్లిలో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో కంపెనీ వారు రూ.3 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంటును వారు ప్రారంభించారు. కంపెనీ సహకారంతో ఇప్పటికే పలు పాఠశాలల్లో లక్షలాది రూపాయల వ్యయంతో అదనపు తరగతి గదులు, ప్రహరీ గోడలు, మినరల్ వాటర్ ప్లాంట్లు, క్రీడామైదానాల అభివృద్ధి వంటి పనులు చేపట్టడం జరిగిందన్నారు. సుమారు 610 మంది బాలికలు చదువుతున్న గురుకుల పాఠశాలలో తాగునీటి సమస్య తమ దృష్టికి రావడంతో రూ.3లక్షల వ్యయంతో ఆర్‌వో ప్లాంటు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పాఠశాలకు ఆర్‌వో ప్లాంటు సమకూర్చిన కంపెనీ యాజమాన్యానికి ప్రిన్సిపాల్ శారద కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ విజయలక్ష్మి కంపెనీ సిబ్బంది శ్రీనివాస్ పాల్గొన్నారు.



గురుకుల పాఠశాలలో ఆర్‌వో ప్లాంటు ప్రారంభిస్తున్న కంపెనీ ప్రతినిధులు

బంగారయ్యపేట ప్రత్యేక రెవెన్యూ పరిధికి చర్యలు

- డీపీవో శిరీషారాణి

నక్కపల్లి : మండలంలో బంగారయ్యపేట గ్రామ పంచాయతీకి ప్రత్యేక ఆర్థిక పరిపుష్టి కల్పించేందుకు గాను ప్రత్యేక రెవెన్యూ పరిధిని నిర్ణయించే ప్రక్రియ ప్రారంభిస్తున్నట్టు జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి తెలిపారు. గురువారం ఆమె బంగారయ్యపేటలో గ్రామసభ నిర్వహించారు. 1985లో గునిపూడి పంచాయతీ నుంచి బంగారయ్యపేట వేరు పడి ప్రత్యేక పంచాయతీగా ఆవిర్భవించింది. అప్పటినుంచి ఈ పంచాయతీకి ప్రత్యేక ఆర్థిక వనరులు కేటాయించలేదు. బంగారయ్యపేటకు ఆనుకుని ఉన్న రెవెన్యూ భూముల్లో జరిగే క్రయ విక్రయాలకు సంబంధించి స్టాంప్ డ్యూటీ ఇతర ప్రభుత్వ నిధుల కేటాయింపులు గునిపూడి పంచాయతీకే జమ అవుతున్నాయి. దీంతో బంగారయ్యపేట గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు తమ పంచాయతీకి ప్రత్యేక ఆర్థిక వనరులు కేటాయించాలని రెవెన్యూ పరిధిని వేరు చేసి సరిహద్దులు నిర్ణయించాలని కలెక్టర్‌కు దరఖాస్తు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం డీపీవో, డీఎల్‌పీవో రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు, రెండు పంచాయతీ పాలకవర్గాలు సమావేశమయ్యారు. డీపీవో మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ సరిహద్దు నిర్ణయించేందుకు బంగారయ్యపేట పంచాయతీకి కేటాయించే సర్వే నంబర్లు గుర్తించేందుకు సర్వే చేపట్టడం జరుగుతుందన్నారు. వారం రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి చేసి కలెక్టర్‌కు నివేదిక పంపిస్తామన్నారు. అక్కడ గెజిట్ ఆమోదం చేసి జిల్లా రిజిస్ట్రార్‌కు పంపిస్తారన్నారు. ప్రభుత్వం నుంచి ఆమోదం లభించిన వెంటనే బంగారయ్యపేటకు కేటాయించిన సర్వే నంబర్లు, రెవెన్యూ పరిధిని అధికారికంగా ప్రకటించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నర్సీపట్నం డీఎల్‌పీవో ఎ.ఎస్.ఎస్ మూర్తి, ఎంపీడీవో సీతారామరాజు, ఈవోపీఆర్డీ వెంకటనారాయణ, ఆర్ఐ ప్రసాద్, సర్పంచ్‌లు అయినంపూడి చినపేర్రాజు, కొవిరి రమణ పాల్గొన్నారు.



గ్రామసభ నిర్వహిస్తున్న డీపీవో శిరీషారాణి

చేతిబోరుకు మరమ్మతు

కోటవురట్ల: వేసవి ఆరంభంతోనే ఎండలు మండిపోతున్నాయి. ఈ తరుణంలో చేతిబోరులు మూలకు చేరితే పాదచారులు, రైతులకు దాహార్తితో ఇక్కట్లు తప్పవు. మూలకు చేరిన చేతిబోరులను మళ్లీ వినియోగంలోకి తీసుకొచ్చేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. కె.వెంకటాపురంలోని మిరాసీ ప్రాంతంలోని పొలాలకు వెళ్లే రహదారిలో ఉన్న చేతిబోరుకు ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది మరమ్మతు నిర్వహించారు. సర్పంచు పైల శ్రీదేవి మంగా ఇందిర భవానీ మాట్లాడుతూ వేసవిలో మంచినీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఎక్కడైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

తృణధాన్యాలతో ఆరోగ్యానికి మేలు

అచ్యుతాపురం(అనకాపల్లి): తృణధాన్యాలు ఆహారంగా తీసుకోవడం వల్ల రక్తపోటు, మధుమేహం, హృద్రోగాలు దరిచేరవని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు రవి ప్రకాష్ అన్నారు. గురువారం అచ్యుతాపురం మండలంలోని ప్రశాంతి విద్యా సంస్థల్లో అంతర్జాతీయ తృణధాన్యాల సంవత్సరం -2023 పురస్కరించుకొని నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తృణధాన్యాల వల్ల రక్తంలో హిమోగ్లోబిన్ పెరగడంతో పాటు, ఎముకల్లో పటుత్వం పెరుగుతుందన్నారు. మండల వ్యవసాయాధికారి శంకర్ గోవింద్, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



తృణధాన్యాల గురించి వివరిస్తున్న సహాయ సంచాలకుడు రవిప్రకాష్

ఘనంగా షిర్డీ సాయి విగ్రహ ప్రతిష్ట

మునగపాక : మునగపాకలో గురువారం శ్రీ షిర్డీసాయి బాబా విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. మునగపాకకు చెందిన పెంటకోట సుబ్బలక్ష్మి, ఆమె కుమారుడు వినోద్‌కుమార్ ఆర్థిక సహకారంతో విగ్రహాన్ని నెలకొల్పారు. ఆలయ ప్రాంగణంలో హోమాలు నిర్వహించి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ దంపతులు, సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఎంపీపీ జయలక్ష్మి, జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ తదితరులు సాయిబాబాను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా 5వేల మంది భక్తులకు ఏర్పాటు చేసిన అన్న సమారాధనకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. అన్న సమారాధనను ప్రసాద్ తదితరులు ప్రారంభించారు. ఆలయ చైర్మన్ బొడ్డేడ వీరేంద్ర భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు చర్యలు తీసుకున్నారు.



షిర్డీసాయి బాబాను దర్శించుకుంటున్న గవర కార్పొరేషన్ చైర్మన్ ప్రసాద్ దంపతులు

ఎన్నికల కోడ్ అమలుకు చర్యలు

మునగపాక : మండల పరిషత్ హాలులో గురువారం ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ఎంపీడీవో పి.రవికుమార్ విడుదల చేశారు. వచ్చే నెల 13న పోలింగ్ జరుగుతుందని 16న కౌంటింగ్ జరుగుతుందన్నారు. మండలంలో ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందన్నారు. ఎక్కడా రాజకీయ నాయకులు ఫ్లెక్సీలు ఉంచరాదని, కోడ్ ఉల్లంఘనకు పాల్పడకుండా తగు చర్యలు తీసుకుంటామని అన్నారు.



ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్‌ను గోడపై అంటిస్తున్న ఎంపీడీవో రవికుమార్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని బ్రాండెక్స్ సబ్‌స్టేషన్, కొండకర్ల సబ్ స్టేషన్ పరిధిలో మెయింటెనెన్స్ పనుల కారణంగా ఈ నెల 17న మండలంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రమణమూర్తి తెలిపారు. ఉదయం 10 నుంచి 5 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, దీనికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు. బ్రాండెక్స్ ఇండస్ట్రియల్ ఏరియా, మడుతూరు, పూడిమడక, కొండకర్ల, ఎంజేపురం, పెదపాడు, తిమ్మరాజుపేట, హరిపాలెం, ఎర్రవరం, మర్రిపాలెం , ఖాజీపాలెం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

ఈ-పంట నమోదు చేసుకోవాలి

యలమంచిలి : రైతులందరూ ఈ పంట నమోదు త్వరితగతిన చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు అన్నారు. గురువారం కృష్ణాపురం గ్రామంలో పంట పొలాలను పరిశీలించారు. రైతులందరూ ఇప్పటి వరకు 1545 ఎకరాల్లో పంటలు వేయడం జరిగిందని, పంట నమోదు చేసుకున్న ప్రతి రైతు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని, రైతు భరోసా కేంద్రాల ద్వారా వ్యవసాయ పంటలు వివరాలు తెలుసుకుని, ఎరువులు, విత్తనాలు పొందాలని అన్నారు. పులపర్తి గ్రామంలో రైతు భరోసా కేంద్రంలో ఉన్న కియోస్క్ పనితీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ రవిప్రకాష్, వ్యవసాయాధికారిణి ఉమాదేవి, ఏఈవో రాజు, వీఏఏ అనురాధ పాల్గొన్నారు.



కృష్ణాపురంలో ఈ పంట నమోదు పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు

అక్రమంగా కలప రవాణా

- 50 వేలు జరిమానా

పాయకరావుపేట : అక్రమంగా రవాణా జరుగుతున్న కలప ట్రాక్టర్లకు జరిమానా విధించినట్టు అటవీశాఖ సెక్షన్ అధికారి విజయ కుమార్ తెలిపారు. నక్కపల్లి మండలం దొండవాక ఏరియా నుంచి ఏవిధమైన అనుమతులు లేకుండా కలప దుంగలు రవాణా జరుగుతున్నట్టు అందిన సమాచారంతో దాడులు నిర్వహించి తాండవ జంక్షన్ వద్ద కలప ట్రాక్టర్లను పట్టుకున్నామన్నారు. వీటికి రూ.50 వేలు జరిమానా విధించినట్టు ఎఫ్ఎస్‌వో విజయకుమార్ తెలిపారు.



పట్టుబడ్డ కలప దుంగలు

ఘనంగా లోవాంబిక అమ్మవారి విగ్రహ ప్రతిష్ట

రాంబిల్లి : గోకివాడ గ్రామంలో గురువారం లోవాంబిక ఆలయ ప్రారంభోత్సవం, అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అమ్మవారి దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ , డీసీసీబీ మాజీ చైర్మన్ ఉప్పలపాటి సుకుమారవర్మ(తేజ), ఎంపీపీ జి.శిరీషశ్రీనుబాబు, జెడ్పీటీసీ ధూళి నాగరాజు, సర్పంచ్ నీరుకొండ శారద, సూర్యనారాయణ దంపతులు, ఎంపీటీసీ అల్లవరపు బాబ్జి, స్థల దాత పిన్నంరాజు చంటిరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు ద్వారపురెడ్డి గోవిందరావు తదితరులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించారు. పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి అమర్‌నాథ్